క్లుప్తంగా

రేషన్ బియ్యం అక్రమ తరలింపు అరికట్టండి



నాగాయలంక: మండలంలో కొనసాగుతున్న ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టాలని కోరుతూ శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ (చిన్నారి) నాగాయలంక తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎస్.ఐ కె.రాజేష్‌లకు వేర్వేరుగా సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలో కొందరు వ్యక్తులు, రేషన్‌వ్యాన్‌లవారు లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కొని రాత్రి సమయాల్లో కొనుగోలు బ్రోకర్ ద్వారా ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారని ఆయన వినతిపత్రంలో వివరించారు. మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాలను అరికట్టి పేద, బడుగు వర్గాలకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి సాయం



చల్లపల్లి(అవనిగడ్డ): రెండు కిడ్నీలు దెబ్బతినడంతో డయాలసిస్ చికిత్స తీసుకుంటున్న చల్లపల్లికి చెందిన అబ్దుల్ సుభాన్‌కు హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఎహియా రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. చల్లపల్లికి చెందిన ఎహియా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తన తండ్రి మహ్మద్ ఇలియాస్ ద్వారా సమాచారం తెలుసుకున్న ఆయన సోమవారం చల్లపల్లి వచ్చి ఈ మొత్తం సహాయాన్ని అందించారు.

నిజాయితీతో సేవలు అందించటం అభినందనీయం



చిలకలపూడి(మచిలీపట్నం): విధి నిర్వహణలో పోలీస్‌శాఖకు నిబద్ధత, నిజాయితీతో సుదీర్ఘ సేవలు అందించటం అభినందనీయమని ఎస్పీ ఆర్ గంగాధరరావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్ఐ పి.బాలకృష్ణారావు, టి.వెంకటేశ్వరరావులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖ నుంచి బయటకు వెళుతున్నందుకు బాధగా ఉంటుందని, వృత్తి బాధ్యతల్లో విరమణ అనేది సహజమని, విధి నిర్వహణలో కనబరిచిన సమయ స్ఫూర్తిని, విలువైన అంశాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులతో వచ్చిన బాలకృష్ణారావు, వెంకటేశ్వరరావులకు పూలమాల వేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

తరగతి గదుల ప్రారంభోత్సవం



ఘంటసాల: ఘంటసాలలో యూవీఆర్ గొర్రెపాటి స్కూల్లో రూ.75 లక్షలతో నిర్మించిన మొదటి బ్లాకు 8 తరగతి గదులను బౌద్ధ సంప్రదాయ పద్ధతుల్లో భంతే ధమ్మ ధజ థెరో ఆధ్వర్యంలో బుద్ధ వందనం చేయగా ఎన్నారై రంగనాథ బాబు సోమవారం ప్రారంభించారు. ఘంటసాల పీహెచ్‌సీలో అసౌకర్యాలను డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, రంగనాథ బాబు దృష్టికి తీసుకురాగా రూ.లక్షతో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, ట్రస్టు ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ లోయ నాగేశ్వరరావు, తెలుగు పండిట్ పిశుపాటి వెంకట నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ రిటైర్డ్ డెప్యూటీ కంట్రోలర్ మృతి



కొక్కిలిగడ్డ(మోపిదేవి): వైఎస్సార్ సీపీ వీరాభిమాని, విశ్రాంత లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ రాయన ప్రభుకుమార్ (67) అనారోగ్యంతో హైదరాబాద్‌లో సోమవారం ఉదయం మృతి చెందారు. వీరి తండ్రి రాయన సాంబశివరావు కొక్కిలిగడ్డ గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఈయన మరణవార్త తెలియడంతో స్వగ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. సాయంత్రానికి కొక్కిలిగడ్డ ఆయన భౌతికకాయాన్ని తీసుకువచ్చారు. మంగళవారం అంతిమయాత్ర నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య ప్రభావతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అనధికార లే అవుట్లను గుర్తించండి

- అనధికార లే అవుట్లలో బోర్డులు ఏర్పాటు చేయాలి
- అక్రమ లేఅవుట్లపై ప్రజలకు అవగాహన కల్పించండి
- కుక్కలు, ఆవుల బెడదను అరికట్టాలి
- మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల వినతి





కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు (ఇన్‌సెట్) మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: పట్టణంలో అనధికార లేఅవుట్లను గుర్తించి వాటి వద్ద బోర్డులు పెట్టి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో అనదికా లే అవుట్ల గురించి గత సమావేశాలలో కూడా చర్చించామని, వాటి వద్ద ఎటువంటి బోర్డులు పెట్ట లేదన్నారు. తక్షణం బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. 9వ వార్డు కౌన్సిలర్ చంద్ర బాబు మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారుల అలసత్వం వల్ల మున్సిపల్ వాహనాలు రిపేర్లకు గురైన వెంటనే బాగు చేయించకపోవడం వల్ల ఆయా వాహనాలు దెబ్బతిన్నాయని ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీలో ఇప్పటివరకు చైర్మన్లుగా పనిచేసిన వారి చిత్రపటాలను కౌన్సిల్ హాల్లో ఏర్పాటు చేయాలని 8వ వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ ప్రతిపాదించగా చైర్మన్‌ల చిత్రపటాలతోపాటు స్వాతంత్ర సమరయోధులు సీఎం, డెప్యూటీ సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలు కూడా కౌన్సిల్ హాల్లో ఏర్పాటు చేయాలని శివపావని సూచించారు. నిబంధనలను అనుసరించి చిత్రపటాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. తామరచెరువుకు పటిష్టమైన గట్టు నిర్మించి పంట పొలాలు ముంపునకు గురికాకుండా చూడాలని, పట్టణంలోని చెరువులను సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని వైస్ చైర్మన్ ఎండీ కాజా కోరారు. 21, 12వ వార్డుల కౌన్సిలర్లు పిచ్చిక సతీష్‌బాబు, మట్టా శివపావని మాట్లాడుతూ పట్టణంలో గ్రామ సింహాల బెడద తీవ్రంగా ఉందన్నారు. కమిషనర్ ఎం.గోపాల్‌రావు మాట్లాడుతూ కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాలని కోర్టు ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ సమాధానం ఇచ్చారు. ఆవుల సంచారాన్ని అరికట్టాలని, ట్రాఫిక్ సమస్య వస్తోందని, శివారులలోని రైతుల పంట పొలాలను నాశనం చేస్తున్నాయని శివపావని సభ దృష్టికి తెచ్చారు. తొలుత వివిధ మున్సిపాలిటీల నుంచి బదిలీపై వచ్చిన ఉద్యోగులు సభకు పరిచయం చేసుకున్నారు. అజెండాలోని 9 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బి.జ్యోతి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, టీపీవో బి.సుజనాకుమారి, ఏఈ సీతా రామాంజనేయులు,ఆర్ఐ పి.వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇప్పించాలని వినతి

లంకపల్లి(ఘంటసాల): ఇటీవల వరదలకు మునిగిపోయిన మా పొలానికి నష్టపరిహారం ఇప్పించడయ్యా అని మండలంలోని లంకపల్లి గ్రామానికి చెందిన రైతులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లంకపల్లి పరిధిలో 150 నుంచి 200 ఎకరాలు వరదలకు పూర్తిగా నష్టపోయామన్నారు. పంట నష్టపోయిన మాకు నష్టపరిహారం రాలేదని వాపోయారు. ఈ విషయం పై సంబంధిత అధికారులను అడిగితే సాకులు చెబుతున్నా రన్నారు. అర్జీ సమర్పించిన వారిలో మోతుక్కూరి వెంకటేశ్వరరావు, మురాల రామ్మోహనరావు, చెన్ను శ్రీను, మాడెం వెంకట నారాయణ, మాడెం శ్రీను, ఉంగ్రకొండ నాగేశ్వరరావు, పరిశే ఏడుకొండలు, ఉంగ్రకొండ చిరంజీవులు, ఇతర రైతులు ఉన్నారు.

ఎంఆర్ఐ బాధ్యతల స్వీకరణ

అవనిగడ్డ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఎంఆర్ఐ)గా బి.బాలాజీ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మచిలీపట్నంలో పనిచేసిన ఆయన ఇటీవలె అవనిగడ్డకు బదిలీపై వచ్చారు. గతంలో అవనిగడ్డలో ఆయన సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు.

తప్పుల తడకగా కూలీల హాజరు రిజిస్టర్లు

ఉపాధి పనులపై ప్రజావేదిక సభలో ఎస్ఆర్‌పీలు



ప్రజావేదిక సభలో డ్వామా ఏవో నాగమహేశ్వరరావు తదితరులు

పెడన: ఉపాధి పనులకు కూలీల హాజరు విషయంలో ఫీల్డ్ అసిస్టెంట్ల అటెండెన్సు రిజిస్టర్లలో కొట్టివేతలు, దిద్దుళ్లు అధికంగా ఉన్నాయని గ్రామ సభలలో ఈ విషయాలను పరిశీలించామని సోషల్ ఆడిట్ రిసోర్స్ (ఆర్పీలు) పర్సన్‌లు ప్రజావేదిక సభా దృష్టికి తీసుకువచ్చారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.7.43 కోట్లతో చేపట్టిన 1,221 పనులపై ఈ నెల 16వ తేదీ నుంచి 29 వరకు జరిగిన గ్రామ సభలలో తనిఖీలు అనంతరం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదిక సభ నిర్వహించారు. 14 రోజుల పాటు తమ తనిఖీలలో పరిశీలించిన అంశాలను డ్వామా ఏవో ఎ.నాగమహేశ్వరరావు, అంబుడ్స్‌మెన్ శ్రీనివాసరావు, విజిలెన్సు ఏఈవో సురేష్‌ల దృష్టికి తీసుకువచ్చారు. పలువురు ఆర్పీలు మాట్లాడుతూ గ్రామ సభలకు హాజరుకావాల్సిన ప్రత్యేక అధికారులు హాజరుకావడం లేదని, కారణం వారికి గ్రామ సభకు హాజరైనందుకు అందాల్సిన గౌరవవేతనం సక్రమంగా అందడం లేదనే విష యంతెల్సిందన్నారు. రిజిస్టర్లు సరిగ్గా నిర్వహించడం లేదని, ఎన్ని సార్లు చెప్పినా మార్పు రావడం లేదన్నారు. పనులు పూర్తయిన చోట నేమ్ బోర్డులు పెట్ట లేదని ఫిర్యాదు చేశారు. పంచాయతీల వారీగా పనులు, రిజిస్టర్లను పరిశీలించారు. రికవరీ కింద రూ.14,800, ఫైన్ కింద రూ.2 వేలు చెల్లించాలని పలువురు ఎఫ్ఏలను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వీ రెడ్డయ్య, సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్ పర్సన్‌లు సీహెచ్ సత్యనారాయణ, ఈశ్వరరావు, ఏపీవో వజీర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేసుకోండి

నాగాయలంక: మండలంలో అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్, సహాయ ఓటరు నమోదు అధికారి ఎం.హరనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటరు నమోదు కోసం ఫారం–18ను సంబంధిత ధ్రువీకరణ పత్రాలను గజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించి జతచేసి ఇవ్వాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సీఈఓ వెబ్‌సైట్‌కు వెళ్లి స్వయంగా కూడా నమోదు కావచ్చన్నారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పీడీ మారుతికి ఉత్తమ క్రీడా పురస్కారం



గోగినేనిపాలెం(ఘంటసాల): మండలంలోని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ పీడీ మారుతి మేజర్ ధ్యాన్‌చంద్ స్మారక క్రీడా పురస్కారం అందుకున్న సందర్భంగా సోమవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. అవార్డు అందుకున్న మారుతిని హెచ్‌ఎం వేణుగోపాలరావు, పీఎంసీ కమిటీ చైర్మన్ కుంపటి జీవన్ కుమార్, వైస్ చైర్మన్ కుంపటి శ్రీలక్ష్మి, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు, సిబ్బందికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

శరన్నవరాత్రుల నిర్వహణకు ఏర్పాట్లు

నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం సముదాయం లోని శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో 3వ తేదీ నుంచి 35వ వార్షిక శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్ (బుజ్జి) సోమవారం చెప్పారు. అమ్మవారికి నిత్య అలంకార పూజలతో పాటు 11వ తేదీ న శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్‌లో తెలుగు రాష్ట్రాల సంప్రదాయక బతుకమ్మ వేడుక, 12న శమీవృక్షపూజ, కృష్ణానదిలో కనకదుర్గమ్మ తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

3 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

కోడూరు: కృష్ణానదిలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు ఆలయ ఈఓ సీహెచ్.సుధాకర్ సోమవారం తెలిపారు. 3 నుంచి 12వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో రోజూ అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్ది భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నట్లు చెప్పారు. 3న విశ్వనాథపల్లి భక్తసమాజంచే భజన కార్యక్రమం, 4న మురళీకోలాటం, 5న జరుగువానిపాలెం శ్రీనివాస భక్త బృందం సభ్యులతో గాన కచేరీ, 6న గుడివాడకు చెందిన పాదర్తి సిస్టర్స్ బృందంచే జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శన, 7న గుంటూరు రాధామాదవ నాట్యక్షేత్రానికి చెందిన కళాకారులచే భారతనాట్య ప్రదర్శన, 8న వి.కొత్తపాలెం, బడేవారిపాలెం భక్తబృందాలచే భజన, మురళీకోలాటం, 9న మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం, సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఈఓ సుధాకర్ తెలిపారు. 10న చినముత్తేవి వేణుగోపాల భక్తసమాజం సభ్యులతో అమ్మవారి గాన కచేరీ, 11న సూరగం రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో రేలారే-రేలా జానపద కళాకారులతో జానపద గీతాలు, నృత్యాల ప్రదర్శన ఉంటుందన్నారు. 12న శమీవృక్ష పూజ, అనంతం కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి ఊరేగింపును నిర్వహించనున్నట్లు ఈఓ చెప్పారు.

గూడూరు: ఈ నెల 3 నుంచి గూడూరులోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో టి.వి.వి.మోహనరావు తెలిపారు. ప్రతి రోజూ వివిధ రూపాలలో అమ్మవారు దర్శనమిస్తారని ఆయన వెల్లడించారు.

వక్తృత్వ పోటీలో హన్సిక ఫణిదేవి జిల్లా ప్రథమం



శ్రీకాకుళం(ఘంటసాల): స్వర్ణాంధ్ర–2047లో భాగంగా కృష్ణాజిల్లా స్థాయిలో మచిలీపట్నంలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో మండలంలోని శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని టి.హన్సిక ఫణిదేవి మొదటిస్థానం సాధించినట్లు హెచ్‌ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీఈవో తాహెరా సుల్తానా చేతుల మీదుగా ఫణిదేవి బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించినందుకు హెచ్‌ఎం భువనేశ్వరితో పాటు ఎంఈవో 1, 2 శివశంకరరావు, ఎండి మోమిన్ వీర కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో సెలక్షన్ కమిటీ సభ్యులు

అవనిగడ్డ: స్థానిక ఇండోర్ స్టేడియంలో సోమవారం జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం జరిగింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొనగా ఒక్కొక్క కేటగిరీకి ఐదుగురు చొప్పున ఎంపిక చేశారు.

జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు వీరే..

అండర్–14 బాలుర విభాగంలో కె.లోకేష్, కె.లక్ష్మణుడు, ఎం.మణికంఠ, కె.కార్తీక్, కె.రాముడు, అండర్–17లో సయ్యద్ అబ్దుల్ రజాక్, పి. రోహిత్ కల్యాణ్, టి.సుహాస్, యు.చార్విష్, డి.ప్రేమ్ సాగర్ ఎంపికయ్యారు. అండర్- 14 బాలికల విభాగంలో డి.యామిని, ఎం.ఐశ్వర్య, కె.రేచల్, జి.మహేశ్వరి, ఏ రోషిణి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి కోసూరు పూర్ణచంద్రరావు పర్యవేక్షించగా, సెలక్షన్ కమిటీ సభ్యులు మునగాల ఉదయ్‌కుమార్, శ్రీకాంత్, అమ్మల బానుప్రకాష్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడూరు: స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో కోడూరుకు చెందిన రవితేజ పబ్లిక్ పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థి అండర్ –4 విభాగంలో కృతి కార్తీక బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటారు. కృతి కార్తీక నియోజవర్గ స్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో ఆడేందుకు రెండు మండలాల నుంచి ఆరుగురు అర్హత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. కృతి కార్తీకను పాఠశాల డైరెక్టర్ వల్లభనేని వరప్రసాద్, విద్యార్థికి శిక్షణ ఇచ్చిన ప్రిన్సిపాల్ కొరివి అనిల్‌కుమార్, పాఠశాల యాజమాన్యం అభినందించింది.

ముగిసిన పౌష్టికాహార మాసోత్సవాలు



కృత్తివెన్ను: గత నెలరోజులుగా జరుగుతున్న పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు సమావేశం సోమవారం లక్ష్మీపురం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సముద్రవేణి, హెల్త్‌ఎడ్యుకేటర్ ప్రభావతి, సూపర్‌వైజర్ రాఘవమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలను వివరించారు.

పోలీస్ కుటుంబానికి చేయూత



క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎస్పీ గంగాధరరావు

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల మృతి చెందిన ఏఎస్ఐ ఎం.సుబ్బారావు కుటుంబ సభ్యులకు పోలీస్‌శాఖ అండగా నిలిచిందని ఎస్పీ ఆర్.గంగాధరావు తెలిపారు. సోమవారం ఆయన సుబ్బారావు కుటుంబ సభ్యులకు లోన్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను ఆయన ఛాంబర్‌లో అందించారు. ఎస్పీ మాట్లాడుతూ ఏఎస్ఐ సుబ్బారావు వ్యక్తిగత అవసరాల కోసం జిల్లా పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీలో రుణం తీసుకున్నారన్నారు. అనారోగ్య కారణాలతో 2024 ఆగష్టు 19న ఆయన మృతి చెందారని తెలిపారు. సొసైటీలో నూతనంగా ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ విధానం ద్వారా మరణించిన ఏఎస్ఐ తీసుకున్న రుణం రూ.3,15,000 మాఫీ చేసి లోన్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను భార్య జయలక్ష్మికి అందజేశారు. దీంతో పాటు రూ.10 వేలను మట్టి ఖర్చుల నిమిత్తం అందజేశామన్నారు. కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ విధానం ద్వారా రుణ మాఫీతో పాటు కుటుంబ సభ్యులకు భరోసా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

4న గుడివాడలో జాబ్‌మేళా

మచిలీపట్నంటౌన్: ఈ నెల 4న గుడివాడలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఈ జాబ్‌మేళాలో పలు ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఆయా కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల్లోపు నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. నెలకు రూ.9 నుంచి 24 వేల వరకు వేతనం, ఇతర సౌకర్యాలు ఉంటాయన్నారు. వివరాలకు 98488 19682 సంబరును సంప్రదించాలని వారు సూచించారు.

బదిలీ అయిన ఉద్యోగులకు సన్మానం

ఘంటసాల: మండలం నుంచి బదిలీపై వెళ్తున్న 12 మంది ఉద్యోగులను సోమవారం ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేమూరి రజనీ కుమారి, జెడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ, వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, కోఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ వలి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు, గ్రామ సచివాలయాల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, టీడీపీ సీనియర్ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం

పెడన: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని, వారి ఆరోగ్యం కోసం వెద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. స్వచ్ఛతాహీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా పట్టణ ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తమ తమ పరిధిలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, 21వ వార్డు కౌన్సిలర్ పిచ్చిక సతీష్‌బాబు, డాక్టర్ ప్రీతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎస్ఐనా.. మజకా..!

స్టేషన్లో ఎస్ఐ జన్మదిన వేడుకలు జరిపిన కూటమి నేతలు



పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐతో కేక్ కట్ చేయిస్తున్న కూటమి నేతలు

కోడూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా పి.శిరీష విధుల్లో చేరిన దగ్గర నుంచి రాజకీయ పార్టీల నేతలకు అండగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. అయితే సెప్టెంబర్ 29 ఆదివారం ఆమె జన్మదినం కావడంతో సోషల్ మీడియా వేదికగా రాజకీయ పార్టీ నేతలు, వివిధ హోదాల్లో ఉన్న వ్యక్తులు ఎస్ఐకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్ ఆవరణను రాజకీయ పార్టీల నేతలు ఓ ఫంక్షన్ ప్రాంగణంగా మార్చేశారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తులకు జరిగేలా ఎస్ఐ జన్మదిన వేడుకలను మండలానికి చెందిన కూటమి నేతలు అట్టహాసంగా నిర్వహించారు. కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎస్ఐ జన్మదిన వేడుకలను నిర్వహించేందుకు పోటీ పడ్డారు. కూటమిలో ఉన్న నేతలు వర్గాల వారీగా వెళ్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో కేకులు కట్ చేయించారు. కేక్ కటింగ్ మాత్రమే కాకుండా స్టేషన్ వద్దే భారీ బాణాసంచా కాల్చి, ఎస్ఐను పూలమాలలు, దుశ్శాలువాలతో ముంచెత్తారు.

సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా..

సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో యూనిఫాం వేసుకొని ఎస్ఐ శిరీష కూటమి నేతలతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైయింది. పేకాట, కోడిపందేలు, అక్రమ మద్యం, మట్టి, రేషన్ బియ్యం రవాణాకు ఎస్ఐ నుంచి కూటమి నేతలకు పూర్తి అండదండలు ఉన్నాయని, దీంతోనే కూటమి నేతలు ఈ తరహాలో జన్మదిన వేడుకలు జరిపారని మండల ప్రజలు బాహాటంగానే అనుకుంటున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ తరహా వేడుకలు గతంలో ఎప్పుడూ చూడలేదని నాయకులే చెప్పుకుంటున్నారు. రాగద్వేషాలకు అతీతంగా పని చేస్తామని ప్రమాణాలు చేసి బాధ్యత చేపట్టిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరించడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి.


దేవస్థానంలో సీల్డ్ టెండర్లు ఖరారు



వేలం నిర్వహిస్తున్న ఆలయ డీసీ శ్రీరామ వరప్రసాదరావు, అధికారులు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో వివిధ కేటగిరీల్లో లైసెన్సు పొందుటకు సీల్డ్ టెండర్లు ద్వారా ఖరారు చేసినట్లు ఆలయ డీసీ శ్రీరామ వరప్రసాదరావు సోమవారం వెల్లడించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో సీల్డ్ టెండర్లు ఓపెన్‌చేసి అత్యధిక పాటదారుల పేర్లు ప్రకటించారు. నవంబర్ 1, 2024 నుంచి అక్టోబర్ 31, 2025 అనగా ఒక సంవత్సర కాలపరిమితికి వివరాలు తెలిపారు. అలయంలో అన్న ప్రసాదం కొరకు కూరగాయలు సరఫరాకు సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించగా టెండర్ దారులను నెగోసియేషన్ చేయవలసి ఉందని తెలిపారు. రాతి శిలలు సరఫరా, భక్తులు సమర్పించిన చీరలు 489, పంచెలు మొత్తంగా పాడుటకు కోసూరువారిపాలెంకు చెందిన సనకా సాయి వెంకట్‌కు సీల్డ్ టెండర్ ద్వారా పొందారని తెలిపారు. గోశాలలో పశువుల ఎరువు గుట్ట మొత్తం తీసుకుని పోవుటకు మోపిదేవికి చెందిన పెద్దిబోయిన రామగోపి టెండర్ ద్వారా పొందారని, ఆర్జిత సేవలో ఉపయోగించు ఆవు పెరుగు సరఫరాకు సీల్డ్ టెండర్ ద్వారా మోపిదేవికి చెందిన వీఎల్‌వీకే గుప్త సీల్డ్ టెండర్ ద్వారా పొందినట్లు, మిగిలిన కేటగిరీల్లో ఔత్సాహికులు ఎవరూ ముందుకు రానందున వాటిని వాయిదా వేసినట్లు ఆలయ డీసీ వివరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా ప్రయత్నిస్తాం



నీలిపూడిలో పంటనష్టపోయిన రైతుల వివరాలను సేకరిస్తున్న ఏవో జెన్నీ

సాక్షి స్పందన

కృత్తివెన్ను: ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగిన వరిచేలకు నష్టపరిహారం విషయంలో రైతుల జాబితాలో మండలంలోని నీలిపూడిలో జరిగిన అవకతవకల విషయంపై వ్యవసాయశాఖాధికారులు స్పందించారు. దీనిపై సెప్టెంబర్ 29న 'పరిహారం ఇవ్వాలంటూ రైతుల ఆందోళన' శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంఏవో ఎస్.జెన్నీ సోమవారం నీలిపూడిలో రైతులతో మాట్లాడారు. తమ గ్రామంలో వీఏఏగా పని చేస్తున్న ఉద్యోగి నిర్లక్ష్యం కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం దక్కలేదంటూ రైతులు తీవ్రస్థాయిలో తమ నిరశన వ్యక్తం చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో సదరు వీఏఏను నీలిపూడి నుంచి సీతనపల్లికి బదిలీ చేసినట్లు ఏవో తెలిపారు. ప్రస్తుతం నష్టపోయిన రైతుల వివరాలను సేకరిస్తున్నామని, నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. వారి ఆదేశాలకనుగుణంగా చర్యలు చేపడతామని ఆమె వివరించారు.

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన బాలికలు

గూడూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గూడూరు జెడ్పీ హైస్కూలులో నిర్వహిస్తున్న పెడన నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో బాలికలు సత్తాచాటారు. బాలికల అండర్–14, 17 విభాగాలలో నిర్వహించిన సెలక్షన్స్‌లో గూడూరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల క్రీడాకారిణులు తమ ప్రతిభ కనబరిచారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కత్రో విభాగాలలో బాలికలు పోటీ పడ్డారు. పోటీలను నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జి సీహెచ్.మురళీకృష్ణ, పీడీలు పాల్గొన్నారు. నియోజకవర్గ స్థాయి బాలుర అథ్లెటిక్స్ జట్ల సెలక్షన్స్ మంగళవారం నిర్వహిస్తామన్నారు.